
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3। కనిష్ఠం 24.7




ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 10 జూలై 2024



తమ భూమిని తమకు ఇప్పించాలని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన బట్టిసావర్గాం దళిత రైతులు



● నూతన కలెక్టర్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న అసైన్డ్ భూమిలో ఏర్పాటు చేసిన వెంచర్

అసైన్డ్ భూములపై.. కన్ను!

- జిల్లాలో భూముల ధరలకు రెక్కలు
- బట్టి సావర్గాం, మావల పరిధిలో కోట్ల రూపాయల విలువైన భూములు
- అమాయక రైతుల అవసరాలే ఆసరాగా రెచ్చిపోతున్న దళారులు
- నగదు ఆశ చూపి తక్కువ ధరకే కొట్టేస్తున్న వైనం
- అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్న అక్రమార్కులు
- అయినా.. ఉలుకుపలుకు లేని సంబంధిత అధికారులు
- జిల్లావ్యాప్తంగా భూ ఆక్రమణలపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

ఆదిలాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం చుట్టూ ఉన్న భూముల ధరలకు రెక్కలు రావడంతో బడాబాబుల కన్నుపడి కనిపించకుండానే పోతున్నాయి. గతంలో నిరుపేద దళిత కుటుంబాలకు ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం కింద అసైన్డ్ భూములను అందించింది. మావల, బట్టిసావర్గాం గ్రామాల పరిధిలో వందల ఎకరాల అసైన్డ్ భూముల్లో అక్రమాలు జరుగుతున్నా.. అధికారులకు అసలు పట్టింపే లేకుండా పోయింది. అయితే ఈ భూము లు పంటల సాగుకు అనుకూలంగా లేకపోవడంతో బీడు భూములుగా మారా యి. ఈ భూముల గుండా 44వ జాతీయ రహదారి వెళ్లడంతో ఒకేసారి వీటి విలువ కోట్ల రూపాయలకు పడగెత్తింది. దీంతో అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు దళారులు ఎంతో కొంత నగదును ఆశచూపి చౌక ధరకే కొట్టేశారు. గత నాలుగైదేళ్ల క్రితం రూ.2 నుంచి రూ.3లక్షల వరకు ధర పలికిన ఎకరం భూమి.. ప్రస్తుతం కోటికి పైగా ధర పలుకుతోంది. అలాగే నూతన కలెక్టర్ భవన నిర్మాణంతో పాటు ఐటీ టవర్ నిర్మాణం పనులు ఈ భూము లకు ఆనుకొనే కొనసాగుతున్నాయి. దీంతో అసైన్డ్ భూముల ధరలు అమాం తంగా పెరిగిపోవడంతో భారీ డిమాండ్ ఏర్పడింది. అయితే అసైన్డ్ భూములను అమ్మేందుకు, కొనేందుకు అవకాశం లేకపోవడంతో తెల్ల కాగితాలపై పట్టాదారులతో సంతకాలు చేయించిన దళారులు.. అమ్మేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై మావల తహసీల్దార్ వేణుగోపాల్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఇంటి నెంబర్‌తో రిజిస్ట్రేషన్‌లు

అసైన్డ్ భూములను చౌక ధరలకే కొట్టేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా మార్చి అమ్మేసుకుంటూ.. అందిన కాడికి దండుకుంటున్నారు. గ్రామ పంచాయతీ జారీ చేసిన ఇంటి నెంబర్‌లతో గుంటల కొద్ది రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అసలు ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా.. బట్టిసావర్గాం, మావల గ్రామ పంచాయతీ పరిధిలో వందలాది ఇంటి నెంబర్లను కేటాయించారు. దీని ఆధారంగా ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ అధికారులు అసైన్డ్ భూములకు సైతం అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేశారు. ప్రస్తుతం కబ్జాలో అమాయక రైతులే ఉన్న ఎలాంటి ఆధారం లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. దళారులు తెలివిగా బాండ్ పేపర్లపై కొనుగోలు ఒప్పందం చేసుకుని భూ దందాకు ఎగబడుతున్నారు. మావల, బట్టిసావర్గాం గ్రామ పంచాయతీల పేరిట నకిలీ పత్రాలను సృష్టించి కోట్ల రూపాయల విలువైన భూములను అమ్మేసుకుంటున్నారు. అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేయడం గ్రామ పంచాయతీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులకు మంచి ఆదాయ మార్గంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇస్తేనే రిజిస్ట్రేషన్లు చేయడం అధికారులకు అలవాటుగానే మారిందంటున్నారు. మావల, బట్టిసావర్గాం గ్రామ పంచాయతీలలో జారీ చేసిన నకిలీ ఇంటి నెంబర్‌లపై లోతుగా దర్యాప్తు జరిపితే భారీ స్కాం బయట పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఎన్‌వోసీల కోసం పైరవీలు

అసైన్డ్ భూములను చట్టబద్ధంగా అమ్మేసుకునేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొత్త ఎత్తుగడను వేస్తున్నారు. మొదట రైతుల నుంచి తక్కువ ధరకే అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల అండదండలతో అనుకూలంగా మార్చుకోవడం పరిపాటిగా మారిందంటున్నారు. అంతేకాకుండా అడ్డదారిలో ఎన్‌వోసీలను సంపాదించి అక్రమంగా భూదందాలకు ఎగబడుతున్నారు. బట్టిసావర్గాం పరిధిలోని సర్వే నెంబర్ 72, 70, 15, 13, 14లలో బై నెంబర్లను సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారు. మళ్లీ తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో కొందరు ఇదే పనిగా పైరవీలు మొదలు పెట్టినట్లు తెలుస్తుంది. ఇప్పటికే పార్టు బి, నిషేధిత జాబితాలో పెట్టిన భూములు సైతం రిజిస్ట్రేషన్ కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రెవెన్యూ చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని కోర్టును ఆశ్రయిస్తున్నారు. కోర్టు ఆర్డర్ ఉందంటూ అధికారులను సైతం బెదిరింపులకు గురిచేస్తున్నారు. అధికారులకు పదేపదే ఫిర్యాదు చేస్తున్న పరిష్కారం మాత్రం చూపడం లేదని అసలైన లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లా ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నా.. పరిష్కారానికి నోచుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అప్పుగా ఇచ్చి.. భూమిని లాక్కున్నారు

: దర్శనాల లక్ష్మిబాయి, బట్టిసావర్గాం, మావల మండలం



బట్టిసావర్గాం పరిధిలోని సర్వే నెంబర్ 15/4లో ఎకరం భూమి ప్రభుత్వం ఇచ్చింది. ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యాపారి రూ.3లక్షలు అప్పుగా ఇచ్చి ఆ భూమిని లాక్కున్నాడు. దానికి సంబంధించిన పట్టాపాస్ పుస్తకం కూడా అధికారులు ఇవ్వడం లేదు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పడం లేదు. మావల తహసీల్దార్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదు. నాలాగానే మరికొంత మంది కూడా భూమి కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

సంక్షిప్త సమాచారం

పంచాయతీ రాజ్ ఎస్ఈగా జాదవ్ ప్రకాష్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 9: జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈగా జాదవ్ ప్రకాష్ నియమితులయ్యారు. మంచిర్యాల జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీర్ (టెక్నికల్)గా పని చేసినజాదవ్ ప్రకాష్ ఆదిలాబాద్ జిల్లా ఎస్ఈ పంచాయతీరాజ్‌గా పదోన్నతి పొంది బదిలీ పై వచ్చారు. ఈ మేరకు కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే అనిల్ పర్యటన

నేరడిగొండ, జూలై 9: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బుధవారం మండలంలో పర్యటించనున్నారు. 10 గంటలకు మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో హరితహారం కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం 12.30 గంటలకు బోథ్ మండలం లోని సోనాల గ్రామంలో మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారని మండల ప్రజాప్రతినిధులు నాయకులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

..మున్నూరు కాపు సంఘ భవనం ప్రారంభం

బోథ్, జూలై 9: మండలంలోని సోనాల గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు సంఘం భవనాన్ని ఈనెల 10న బుధవారం ప్రారంభించను న్నట్లు మున్నూరు కాపు సంఘం సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఎంపీ జి.నగేష్, మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్సీ దండే విఠల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు సత్తు మల్లేష్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్, మున్నూరు కాపు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మున్నూరు కాపు సంఘం సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

13న జగన్నాథుడి రథయాత్ర

ఆదిలాబాద్ అర్బన్, జూలై 9: ఈనెల 13న ఇస్కాన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శ్రీజగన్నాథుని రథయాత్ర మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రథయాత్ర వివరాలను వెల్లడించారు. రథయాత్ర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'ఆదివాసీ దినోత్సవాన్ని గుస్సాడి గుట్టలో నిర్వహించాలి'

ఉట్నూర్, జూలై 9: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలకేంద్రంలోని గుసాడిగుట్టలో నిర్వహించాలని, ఈ సందర్భంగా గోండి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తకు రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, రాజ్‌గోండుసేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పీవో మాట్లాడుతూ త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నట్లు వారు తెలిపారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మరమ్మతు పనులను పరిశీలించిన కలెక్టర్

జైనథ్, జూలై 9: జైనథ్, బేల మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రజలు వర్షాకాలంలో వాటిల్లే వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన సాత్నాల ప్రాజెక్టు, కోర్టా-చనకా బ్యారేజ్, హత్తిఘట్ పంప్‌హౌజ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ప్రతినిధికారి ఎస్.రాము, ఎస్ఈ విఠల్ తులసిరామ్, డీఈలు మనోహర్, శ్రీనివాస్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సాత్నాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

కలెక్టర్, అధికారులపై తేనెటీగల దాడి

ఆదిలాబాద్ అర్బన్: ప్రాజెక్టుల పర్యవేక్షణకు వెళ్లిన కలెక్టర్ రాజార్షిషాపై అకస్మాత్తుగా తేనెటీగలు దాడి చేశాయి. మంగళవారం జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం అదే మండలంలోని హత్తిఘాట్ పంప్ హౌజ్ పరిశీలనకు వెళ్లిన జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులపై తేనెటీగలు దాడి చేసిన ఘటనలో పలువురు గాయపడ్డారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది తేనెటీగల దాడి నుంచి జిల్లా కలెక్టర్‌ను తప్పించడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అయితే ఆయన వెంట వెళ్లిన ఇరిగేషన్ ఎస్ఈ రాముతో పాటు పలువురు ప్రాజెక్టు మేనేజర్లు, డీఈ మనోహర్, జేఈలు నాగేశ్వర్, మురళీ, ఇతర సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అందరి పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు చెబుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

● గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 9: క్రీడకారులు రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రతిభ చాటాలని గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. ఈనెల 13, 14వ తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు జరుగనున్నాయి. మంగళవారం స్టేడియంలో జిల్లా క్రీడకారులను ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందించారు. అనంతరం గిరిజనక్రీడల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ స్విమ్మింగ్ అంతర్జాతీయ క్రీడ అని, అభివృద్ధి చెందిన దేశాలు మంచిగా రాణిస్తున్నాయన్నారు. పిల్లలను కేవలం సమ్మర్‌లోనే స్విమ్మింగ్ పంపుతున్నారని, నిత్యం పంపిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. ఒలంపిక్స్‌లో కూడా స్విమ్మింగ్‌కు గుర్తింపు ఉందన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన 15 మంది ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేకే అకాడమి కోచ్‌లు కొమ్ము కృష్ణ, కాంతు, స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌జిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ అందజేస్తున్న జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి



మంగ్లీ గ్రామానికి వాగు దాటి వెళుతున్న వైద్య సిబ్బంది



గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

6కిలోమీటర్లు నడిచి.. వాగు దాటి..

● వైద్య సేవలు అందించిన సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, జూలై 9 : ఆ గ్రామానికి రవాణా సౌకర్యం లేదు. కనీసం నడిచి వెళదామనుకుంటే రోడ్డు మార్గమూ లేదు. దీంతో 6 కిలోమీటర్ల మేర నడిచి.. వాగు దాటి అక్కడి ప్రజలకు వైద్యులు సేవలందించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మారుమూల గ్రామమైన మంగ్లీ గ్రామంలో 11 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మండలంలోని అంకుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సర్ఫరాజ్ ఆధ్వర్యంలో.. మంగళవారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అయితే గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో.. వైద్య సిబ్బంది సుమారు 6 కిలోమీటర్లు నడిచారు. ఆ తర్వాత వాగు దాటి మంగ్లీ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 11 కుటుంబాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి పలు సూచనలు చేశారు.

'కౌలు రుణ అర్హత కార్డులు ఇవ్వాలి'

గుడిహత్నూర్, జూలై 9: కౌలు భూమిని సాగు చేస్తున్న రైతులను గుర్తించి కౌలు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 28,763 మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికైనా కౌలు రైతులను గుర్తించి కౌలు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



ఉట్నూర్‌లో సీతక్క జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్, జూలై 9: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని వికాసం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు కేక్ తినిపించుకున్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ అన్ని అసమానతలతో పోరాటడం సీతక్క వ్యక్తిత్వమని, అణగారిన వర్గాల పక్షాన నిలబడాలన్నది ఆమె దృక్పథం అని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా జిల్లా అభివృద్ధికి మంత్రి సీతక్క అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్‌సలాం, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆత్రం రాహుల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివాజీదావత్, జిల్లా నాయకులు జితేందర్, అరీఫ్, మహిళ నాయకులు రాజవ్వ, కౌసల్య, సత్య, పాఠశాల సిబ్బంది, తదితరులున్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి కాంగ్రెస్ నేతలకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ పేదల శ్రేయస్సు కోరే ప్రజా నాయకురాలు మంత్రి సీతక్క అని అన్నారు. నిరంతరం పేదల పక్షాన నిలబడతారని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: ప్రజల కోసం పరితపించే మహా నాయకురాలు రాష్ట్ర మంత్రి సీతక్క అని కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ అన్నారు. మంగళవారం ప్రజాసేవ భవన్‌లో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మహిళ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ ప్రజల కోసం, వారి అభ్యున్నతి కోసం సీతక్క అనేక ప్రజా ఉద్యమాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, పట్టణ అధ్యక్షుడు నగేష్, మహిళ నాయకురాళ్లు ప్రేమల, అన్నపూర్ణ, శ్రీలేఖ, అతికుర్రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు



ఆదిలాబాద్‌లో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ మండల అధ్యక్షుడు చహకటి మాణిక్‌రావు, నాయకులు గాయక్‌వాడ్ భగవాన్, జెల్పట్ మారుతి, బాలాజీ, సూర వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

భోథ్: మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రమంత్రిగా జిల్లా ఇంచార్జి మంత్రిగా సీతక్క, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ పోశెట్టి, వీడీసీ అధ్యక్షులు జి.గంగాధర్, మాజీ వార్డు సభ్యులు షేక్ షాకీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మెరుగు భోజన్న, శేఖర్, మైనారిటీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ హసీప్‌లు పాల్గొన్నారు.





భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంగన్‌వాడీల భిక్షాటన

ఆదిలాబాద్ రూరల్, జూలై 9: ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంగన్‌వాడీ ఉద్యోగులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ. లక్షా పెంచుతామని, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జగదాంబ దేవి ఆలయాన్ని దర్శించుకున్న ఆడే గజేందర్

భోథ్, జూలై 9: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో కొలువు దీరిన సేవాలాల్ జగదాంబ ఆలయాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు సాదరంగా ఆహ్వానించి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, నాయకులు బాబు, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.



గన్‌పూర్ గ్రామస్థులతో సమావేశమైన ఆడే గజేందర్





పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవు

● డాక్టర్ నవీన్‌రెడ్డి

బోథ్, జూలై 9: పరిసరాలను వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే రోగాలు దరి చేరవని డాక్టర్ నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హాస్టల్ చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిరోజు పడుకునే బట్టలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతేగాక వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్లయితే వ్యాధులు దరి చేరవని వివరించారు. వైద్య శిబిరంలో డాక్టర్‌తో పాటు సూపర్ వైజర్ కవిత, ఏఎన్ఎం సుమంగళి, స్నేహ, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ ఎస్టీ బాలుర వసతి గృహంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



తలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో సంచరిస్తున్న పాము

ఎంపీడీవో కార్యాలయంలో పాము కలకలం

● భయాందోళనలో అధికారులు

తలమడుగు, జూలై 9: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పాము కలకలం రేపింది. ఉదయం 11 గంటలకు విధులకు హాజరైన సిబ్బంది కార్యాలయంకు వచ్చి విధులకు హాజరు కాగా ఒక్కసారిగా పొడవాటి పాము, చెట్లపై నుంచి ఆఫీస్ ఆవరణలోకి రావడంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. వెంటనే అధికారులు గ్రామస్థులకు విన్నవించడంతో స్పందించిన గ్రామస్థులు పామును కొట్టి చంపేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఎంపీడీవో కార్యాలయం అతి పురాతనమైంది కావడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ పాములు వస్తున్నాయని అధికారులు వాపోయారు.

సంతకు వచ్చి గుండెపోటుతో మహిళ మృతి

బోథ్, జూలై 9: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల మెడికల్ షాప్ ఎదురుగా గుండెపోటుతో దన్నూర్ గ్రామానికి చెందిన రత్నపురం ప్రమీల (50) మహిళ మృతి చెందింది. బస్టాండ్ సమీపంలో ఉన్న మెడికల్ షాప్ పక్కన కూర్చుని ఉన్న మహిళకు ఒకేసారి గుండెపోటు రావడంతో వాంతులు చేసుకుని అక్కడికక్కడే కింద పడిపోయి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు మృతి చెందిన మహిళను స్వగ్రామమైన దన్నూరుకు తీసుకెళ్లారు. సంత కోసం వచ్చిన మహిళ ఆకస్మాత్తుగా మృతి చెందడంతో అక్కడున్న గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు.

ప్రమాదవశాత్తు లారీ డ్రైవర్ మృతి

నేరడిగొండ, జూలై 9: లారీ మరమ్మతు కోసం లారీని ఆపగా అ లారీ టైర్ల కింద పడి మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై తమిళనాడు నుంచి ఢిల్లీకి రబ్బర్ లోడుతో వెళ్తున్న క్రమంలో లారీ ఆగిపోగా డ్రైవర్ వడివేలు తంగవెల్ (31) లారీని మరమ్మత్తు చేయడానికి లారీ హైండ్ బ్రేక్ వేయకుండా లారీని మరమ్మతు చేస్తుండగా లారీ వెనుకకు రావడంతో లారీ టైర్ల కింద ఈడ్చుకుని అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

రైతుల కోసం అందుబాటులో రసాయన ఎరువులు

ఇంద్రవెల్లి, జూలై 9: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రైతుల కోసం రసాయన ఎరువులు అందుబాటులో ఉంచేందుకు యూరియా దిగుమతి చేసుకున్నామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ధర్మసింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఈ రసాయన ఎరువులు ప్రభుత్వ ధరల ప్రకారమే అమ్మబడుతాయని వ్యవసాయదారులు రసాయన ఎరువులను తీసుకువెళ్లాలని తెలిపారు. యూరియా దిగుమతి అయినట్లు తెలిపారు. రసాయన ఎరువుల ధరలు యూరియా ఒక బ్యాగ్ ధర రూ. 266.50 సహకార సంఘం పరిధిలోని వ్యవసాయదారులు ప్రభుత్వ ధరలకు అమ్మే ఎరువులను సహకార సంఘం ద్వారా కొనుగోలు చేసుకుని ప్రభుత్వ ధరలు సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

నీలగిరి ప్లాంట్ ఏర్పాటు

నేరడిగొండ, జూలై 9: మండలంలోని వాగ్ధారి గ్రామంలో నీలగిరి ప్లాంట్ ఏర్పాటు కోసం ఆర్ఓఎఫ్ఆర్ రైతు పొలాన్ని ఎంపీడీఓ రాజ్‌వీర్ మంగళవారం పరిశీలించారు. పదెకరాల్లో నీలగిరి మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు టేకుతో పాటు లాభదాయంగా ఉండే మొక్కలను పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో గల మొక్కలను తీసుకుని ప్రతీ ఒక్కరు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీఓ వసంత్‌రావు, తదితరులున్నారు.



వాగ్ధారి అటవీ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్



కోసుపటేల్ గూడలో అకాడి పూజల్లో పాల్గొన్న ఆదివాసీలు

ఘనంగా ఆదివాసీల అకాడి పూజలు

సిరికొండ, జూలై 9: మండలంలోని మారుమూల ఆదివాసీ గూడాల్లో గిరిజన సంస్కృతీ సంప్రదాయలతో అకాడి పండగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతీయేటా ఆషాఢ మాసంలో గిరిజనులు అకాడి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ప్రకృతిని ప్రేమించడం, ఆరాదించడం ఆదివాసీ సంస్కృతీలో భాగం. అందులో భాగంగా వర్షాకాలంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కోసుపటేల్‌గూడ, సుంకిడి గ్రామాలకు చెందిన ఆదివాసీ గిజనులు వనదేతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, పశువులకు, పశువులకాపరులకు అటవీజంతువులు ఎలాంటి హని తల పెట్టవద్దని కోరుతూ వారి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులంతా కలిసి గ్రామ అటవీ ప్రాంతానికి వెళ్లి తమ కుల దైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా తమ కులదైవానికి అన్నంతో లేదా జొన్న గట్కతో లడ్డూల మాదిరిగా నైవేద్యాన్ని తయారు చేసి దేవతలకు సమర్పిస్తారు. అలాగే కోళ్లు, మేకలను కూడా బలి ఇచ్చి వంటలు చేసి అక్కడే టేకు ఆకుల్లో సామూహికంగా భోజనాలు చేశారు. అంతకుముందు పులి కట్టు గీసి పశువులను దానిపై నుంచి దాటించారు. ఇలా చేస్తే అటవీ జంతువులు పశువులకు ఎలాంటి హాని తలపెట్టవని వారి ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమ్రం రావుజీ, దేవరి కుమ్రం జంగుబాపు, మహజన్ కొరెంగ వాగు, కారోబారి కుమ్రం కోసే రావు, కుమ్రం యాదవ్ రావు, లింబారావు, చందు, జంగు, మారుతి, సూర్యభాను, లక్ష్మణ్, ఆనంద్‌రావ్, శివకుమార్, రమేష్, వసంత్‌రావ్, గ్రామపెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధి పనులను పూర్తి చేయండి’

తలమడుగు, జూలై 9: గ్రామాల్లో చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. మంగళవారం మండలంలోని బరంపూర్ గ్రామ పంచాయితీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారుప. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రత్యేక నిధులతో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వర్షాకాలంలో ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రపరచాలని కోరారు. అనంతరం గ్రామపంచాయితీ రిజిష్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో పంచాయితీ సెక్రటరీ అనిల్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



బరంపూర్‌లో తాగునీటి పైప్‌ల పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

మొదలైన కలుపుతీత పనులు

● ఏజెన్సీ గ్రామాల్లో కరువైన కూలీలు ● స్థానిక రైతులను తప్పని తిప్పలు ● గడ్డి మందుకు పెరిగిన డిమాండ్



పత్తి పంటలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు



పత్తి పంటకు స్ప్రే చేస్తున్న రైతు



ఉట్నూర్, జూలై 9: ఖరీఫ్ పంటలు పండిస్తున్న రైతులకు కూలీల కొరత మొదలైనది. తొలకరి వర్షాల దుక్కులు దున్ని విత్తనాలు వేసిన రైతుల పంట భూముల్లో మొలకలు రావడంతో వాటికి తోడు గడ్డి కూడా పెరుగుతుంది. పంటల్లో పెరిగే గడ్డిని వెంటనే తీయక పోతే పంట మొక్కలు పెరగనీయకుండా చేస్తాయని భావిస్తున్న రైతులు కలుపు మొక్కలు తీయడనికి కూలీల కోసం చక్కర్లు కొడుతున్నారు. ఉట్నూర్ మండలంలోని ఎంకా, నగ్దంగూడ, చందూరి, హస్నాపూర్, పులిమడుగు, నర్సాపూర్, ఎందా, ఉమ్రి తదితర గ్రామాల రైతులు ఉట్నూర్ మండల కేంద్రం నుంచి ఆటోలలో వ్యవసాయ కూలీలను తీసుకవెళ్లి రోజుకు రూ.300 ఒక్క కూలికి చెల్లించాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.కలుపు మొక్కలు తీయడానికి రోజుకు వ ఎయ్యి కూలీలకు ఇవ్వడంతో పాటు సస్యరక్షన చర్యలు కూడా పత్తి కంది, సోయాబీన్ తదితర పంటలకు చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

● గడ్డి మందు కృత్రిమ కొరత!!

కలుపు మొక్కల నివారణకు కూలీలు దొరకని రైతులు కొందరు గడ్డి మందు స్ప్రే చేయడం ప్రారంభించారు. దీంతో వ్యాపారులు ఇదే అదునుగా గడ్డి మందుకు కృత్రిమ కొరత సృష్టించే వీలుందని పలువురు స్థానిక రైతులు వాపోతున్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలను తరుచు తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామాలలోని వ్యాపారులు కొందరు సేల్ అండ్ స్టోక్ బోర్డులను పెట్టడం లేదు. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేయకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలోని రైతులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం : ఎంపీ

గుడిహత్నూర్, జూలై 9: పార్లమెంట్ ఎన్నికల్లో లాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గుడిహత్నూర్‌లో నిర్వహించిన విజయోత్సవ అభినందన సభకు ఎంపీ హాజరయ్యారు. అంతకు ముందు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ త్వరలో జరగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, మండలాధ్యక్షుడు కేంద్రే శివాజీ, మాజీ వైస్ ఎంపీపీ భరత్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ కేంద్రే లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ జగన్, తదితరులు పాల్గొన్నారు.



ఇస్రో స్టేషన్ వద్ద గిరిజన విద్యార్థినులు

ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీలను సందర్శించిన ఉమ్మడి జిల్లా గిరిజన బాలికలు

ఉట్నూర్, జూలై 9: ఉమ్మడి జిల్లాలోని ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల బాలికలు హైదరాబాద్‌లోని ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ప్రోత్సాహంతో మంగళవారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆదిలాబద్, ఆసిఫాబాద్ జిల్లాల విద్యార్థులు పీవో ఖుష్బుగుప్త ఆదేశాలతో ఇస్రో, ఎన్ఆర్ఎస్‌సీకి ఆత్మీయ ప్రయాణం చేశారు. గిరిజన విద్యార్థినులు అక్కడి శాస్త్రవేత్తలతో పరస్పర క్రియాశీలతను కలిగి ఇస్రో కార్యక్రమాలు, రిమోట్ సెన్సింగ్, భవిష్యత్ ప్రాజెక్టులు, లాంచ్ వాహనాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో ముఖ్యాంశం రాకెట్ ప్రదర్శన, విద్యార్థులను స్పేస్ సైన్స్, టెక్నాలజీ పట్ల మరింత ప్రేరణతో నింపిందని బృందం టీచర్లు తెలిపారు. ఈ విద్యా ప్రయానం యువ మేధావులలో స్టీమ్ విద్య పట్ల ఆసక్తిని రగిలించిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఇంద్రవెల్లిలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న అఖిలపక్ష నాయకులు

‘రాథోడ్ రమేష్ సేవలు మరువలేనివి’

ఇంద్రవెల్లి, జూలై 9: మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ చేసిన సేవలు మరువలేనివని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అఖిల పక్ష నాయకులు, వ్యాపారస్తులు, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రాథోడ్ రమేష్ శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, ఆదిలాబాద్ ఎంపీగా ఆయన సేవలు అందించారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ధన్‌రాజ్ అగ్రవాల్, వినోద్, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్ సింగ్ షేకావత్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మిర్జా జిలానీ బేగ్, దేవపూజ్ మారుతి, భవలే సత్యానంద్, ఎండీ.జునైద్, తదితరులు పాల్గొన్నారు.

● నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు

ఉట్నూర్: దివంగత ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజా సంఘాల నాయకులు మంగళవారం నివాళులర్పించారు. సీపీఐ జిల్లా ఆదిలాబాద్ ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళిని రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో పట్టుదల తోట సమస్యల పరిష్కారం చేసే విధంగా ఆయన ఎంపీగా జడ్పీ చైర్మన్‌గా ఎమ్మెల్యే అనేక పదవులు అధిరోదించిన నాయకుడన్నారు. రాథోడ్ రమేష్ లేని లోటు ఆదిలాబాద్ ప్రజలకు తీరని లోటుగా భావిస్తున్నామన్నారు. అదే విధంగా రాథోడ్ రమేష్ కుమారుడు రాథోడ్‌రితేష్ మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ జమీల్, టీఆర్ఎస్ నాయకులు సోయం సతీష్, ప్రజాసంఘాల నాయకులు నేతావత్ రామదాసు, రామారావు, మండల కార్యదర్శి సీపీఐ నాయకుడు షేక్ ఫయాజ్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

‘ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి’



హైవే అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ అర్బన్, జూలై 9: జైనథ్ మండలంలోని తర్నం బ్రిడ్జి తాత్కాలిక రోడ్డు వరద ప్రహావానికి కొట్టుక పోయిందని దానిస్థానంలో ఐరన్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో నేషనల్ హైవే అధికారులను ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తర్నం బ్రిడ్జి కుంగి పోవడంతో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసినప్పటికి వరద ప్రవాహంకు కొట్టుకు పోయిందని తెలిపారు. జైనథ్, బేల మండలాల ప్రజల ఇబ్బందులను దృష్ట్యా ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే నూతన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు రాకపోకలు కొనసాగుతాయని తెలిపారు. రెండు మండలాలతో పాటు మహారాష్ట్రకు అనుసంధానంగా ఈ రహదారి ఉందన్నారు.సానుకూలంగా స్పందించిన నేషనల్ హైవేఆర్‌వో అధికారి కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు బీజేపీ నాయకులు ముస్తాపురు అశోక్, తదితరులున్నారు.

రోడ్లపై సంచరిస్తున్న

పశువులను బందెరదొడ్డికి తరలింపు



పశువులను బందెర దొడ్డికి తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భైంసా, జూలై 9 : పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న, రోడ్లపై తిష్టవేస్తున్న పశువులతో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే మంగళవారం ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్న పశువులను మున్సిపల్ సిబ్బంది బందెరదొడ్డికి తరలించారు. ఉదయం వేళలో బస్టాండ్ ప్రాంతంతో పాటు నిర్మల్ క్రాస్ రోడ్డు, మున్సిపల్ మార్గాల్లో రోడ్లపై తిష్ట వేసి ఉన్న పశువులను మున్సిపల్ సిబ్బంది గణేష్‌నగర్ కాలనీ పరిధిలోని బందెరదొడ్డి తరలించే చర్యలు చేపట్టారు. గత కొంత కాలంగా పట్టణ ప్రధాన మార్గాల్లో సంచరిస్తూ రోడ్లపై తిష్టవేస్తున్న పశువులతో సమస్యలు పెరిగాయి. ట్రాఫిక్ ఇబ్బందులు అధికమవ్వడమే కాకుండా రోడ్డు ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను, పెరిగిన చెట్లను పశువులు తినివేస్తున్నాయి. సంబంధిత సమస్యలను పరిష్కరించే చర్యల్లో భాగంగానే ఆయా ప్రాంతాల్లోని పశువులను బందెరదొడ్డికి తరలింపు చేపట్టారు. యజమానులు తమ పశుసంతతిని పశువుల పాకల్లో ఉంచుకోవాలే రోడ్లపై వదిలిపెడితే చర్యలు తప్పవని మున్సిపల్ అధికార యంత్రాంగం వెల్లడించింది. ఇక నుంచి రోడ్లపై సంచరిస్తున్న, తిష్ట వేసిన పశువులను బందెరదొడ్డికి తరలించే చర్యలను ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు.

మోడల్ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించిన ఎంపీడీవో



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, ఎంపీవో

దిలావర్‌పూర్, జూలై 9 : మండలంలోని కాల్వ తండాలో నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో అరుణ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలతో ప్రేమగా వ్యవహరించాలన్నారు. పిల్లలు అల్లరి చేయడం సహజమని అటువంటి పిల్లలను భయపెట్టకుండా ప్రేమగా మాట్లాడి వారి దృష్టిని చదువు, ఆటపాటల వైపు మళ్లించాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ భవనాలను ఆధునాతన హంగులతో అన్ని వసతులు, సౌకర్యాలతో నిర్మిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్ ఖాన్, స్థానిక తాజా మాజీ సర్పంచ్ రమావత్ నీలాబాయి, స్థానిక నాయకులు రవి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భైంసా యువకుడికి శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారం

భైంసా, జూలై 9 : పట్టణంలోని కుమ్మరిగల్లీకి చెందిన కోటగిరి నరేష్‌కు శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్నాడు. మట్టితో వివిధ అకృతుల్లో కళాఖండాలు, పాత్రలు, దేవుళ్ల విగ్రహాలు, గోమాతలను తయారు చేస్తున్నందుకు గాను ఈ అరుదైన పురస్కారం లభించింది.

రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల హామీలను విస్మరిస్తే ఆందోళన తప్పదు

● బీడీ ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులకు, బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి
● తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జూలై 9 : బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ ప్యాకర్స్ నెలసరి ఉద్యోగులు, బీడీ కార్మికులకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి బ్రతుకుతున్నారని, బీడీ పరిశ్రమ రోజురోజుకు క్షీణించి నెలకు 10, 12 రోజుల్లో ఒక రోజుకు ఒక పూట పని మాత్రమే దొరుకుతుందని కార్మికులు పని లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీడీ కార్మికులను ఆదుకోవడానికి ఆనాటి తెలంగాణ ప్రభుత్వం 2013లో ఇచ్చిన హామీ ప్రకారం వెయ్యి రూపాయలు 2018 ఎన్నికల్లో 2016 రూపాయల జీవనభృతి ఇస్తామని ప్రకటించి జిల్లాలో 60 వేల మందికి మాత్రమే అమలు చేస్తున్నారు. మిగతా 40,000ల మందికి జీవన భృతి అందడం లేదని అనేకసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, అందుకే గత ప్రభుత్వాన్ని మార్చారని ఆయన అన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సకల ప్రజలను దారిద్రరేఖ దిగువన జీవిస్తున్న వారిని ఆదుకోవడానికి చేయూత పథకం కింద నాలుగు వేల రూపాయలు జీవన భృతి ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్న పెన్షన్ల ఆచూకీ మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న నిరుపేద కార్మిక కుటుంబాలు బీడీ పరిశ్రమలో కీలక వ్యక్తులుగా మారినా బీడీ ప్యాకర్స్ నెలసరి ఉద్యోగులకు పీఎఫ్ కలిగి ఉండి పురుషులైనందుకు మాత్రమే అప్పటి తెలంగాణ కేసీఆర్ ప్రభుత్వం జీవనభృతి ఇవ్వలేదని, ఈ ప్రభుత్వమైనా ఆంక్షలు పెట్టకుండా జీవో ప్రకారం పీఎఫ్ కలిగిన వారందరికీ జీవన భృతి ఇస్తామని 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ తేదీని ఎత్తివేస్తామని ప్రకటించి ఉన్నారు. కానీ 9 సంవత్సరాల నుండి ఆనాటి ప్రభుత్వ ఏ ఒక్క కొత్త కార్మికురాలు గాని, కార్మికుడికి గాని జీవనభృతి అందించలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురుచూస్తున్న కార్మికులకు మనోధైర్యం ఇవ్వాలని, వారికి చేయూత పథకం కింద నాలుగు వేల రూపాయలు జీవనభృతి మంజూరు చేసి పేద కుటుంబాలను ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఎఫ్ కలిగి ఉన్న కార్మికులకు జీవో, ఎంఎస్ నెంబర్ 38 ద్వారా జీవన భృతి అందజేస్తామని అప్పటి ప్రభుత్వ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తాన్య ప్రకటించారు. కానీ నేటికీ అమలు కావడం లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని లేనిచో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం. బక్కన్న, సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. లక్ష్మి, జిల్లా నాయకులు గంగామణి, విజయ, లక్ష్మి, కమల, పోశెట్టి, రాజేందర్, ఎల్లయ్య, ఫిరోజ్, వెంకటేష్, శ్రీనివాస్‌తో పాటు బీడీ ప్యాకర్స్ నెలసరి ఉద్యోగులు పాల్గొన్నారు.

‘దేశరక్షణకు యువత కంకణబద్ధులవ్వాలి’



జాతీయ విద్యార్థి దినోత్సవంలో ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థులు

భైంసా, జూలై 9 : యువత సన్మార్గంలో పయనిస్తూ దేశరక్షణకు, ధర్మసంరక్షణకు కంకణబద్ధులవ్వాలని ఏబీవీపీ ఇల్లా ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ శివ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని వివేకానంద చౌక్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ విద్యార్థి దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఉన్నత చదువులు చదువుతూ భవిష్యత్తును బంగారుమయం చేసుకునేందుకు గాను ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఇదే క్రమంలో దేశ సేవలో తరించాలన్నారు.స్వామి వివేకానందుడిని మార్గదర్శకంగా తీసుకొవాలని సూచించారు. భైంసా డివిజన్ కార్యదర్శి చంద్రకాంత్ మాట్లాడుతూ అధునిక పోకడలతో, పాశ్చత్య దోరణి విధానాలతో దెబ్బతింటున్న సనాతమైన సంస్కృతి, సంప్రదాయాలు, అచార, వ్యవహారాలను కాపాడేందుకు యువత నడుం బిగించాలన్నారు. ధర్మ సంరక్షణయే ధ్యేయంగా పాటుపడాలన్నారు. చదువే ప్రగతి అన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుపెట్టుకొని అందుకు అనుగుణంగా పయనించాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో స్థిరపడి దేశ సేవకు తమ వంతు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని అకాక్షించారు. చెడు అలవాట్లను దరి చేరనీయకుండా సన్మార్గంలో సత్కార్యాలతో ముందుకు నడువాలన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో ఏబీవీపీ భైంసా డివిజన్ ప్రతినిధులు సాయికిరణ్, అక్షయ్ , సందీప్, శ్రీకాంత్‌లతో పాటు వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సీతక్క జన్మదిన వేడుకలు

దస్తురాబాద్, జూలై 9 : మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇందులో నాయకులు కిషన్, రాజన్న, పుల్యా నాయక్, నాగరాజు, గోపాల్, రాజేశం, రాజమల్లు, గోపి, లచ్చన్న, తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకాన్ని బాధ్యతాయుతతో నిర్వహించాలి



మొక్క నాటుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసా, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటుతున్న మొక్కల పెంపకాన్ని బాధ్యతాయుతతో నిర్వర్తించాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసా పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాలుష్య నివారణకు, పర్యావరణహితం కోసం మొక్కలను నాటి అవి చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పరిడవిల్లితే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఏఎస్పీ అవినాష్ కుమార్ టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ షరీఫ్‌లతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. ఇందులో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా అమ్ముతున్న ఇద్దరి బైండోవర్

నర్సాపూర్(జి), జూలై 9 : మండలంలోని అర్లి(కె) గ్రామంలో నిషేధించిన గుట్కా, అంబర్ పొట్లాలను అమ్ముతున్నారనే సమాచారంతో మంగళవారం ఎస్సై మునిగెల హన్మాండ్లు కిరాణా దుకాణాలలో హోటళ్లలో దాడులు నిర్వహించారు. అర్లి(కె) గ్రామానికి చెందిన సిందే వినాయక్‌రావ్, శ్రీరాన్ సురేష్ ఇద్దరు గుట్కా పొట్లాలు అమ్ముతుండగా పట్టుకొని ఇద్దరు వ్యక్తులను మండల తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ముందర బైండోవర్ చేశారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.9, కనిష్ఠం 25.6



దాతల సహకారం
అభివృద్ధికి శ్రీకారం



మాస్టర్‌ప్లాన్ పనుల కోసం భూమి పూజ (ఫైల్)

ఇటీవల ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో ఆలయ మాస్టర్‌ప్లాన్ గురించి చర్చిస్తున్న ఆలయ ఈవో, స్థానాచార్యులు (ఫైల్)

- బాసర అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చిన దాతలు
- కానీ అనుమతుల కోసం దేవాదాయ శాఖ కొర్రీలు
- ఒక పక్క మాస్టర్‌ప్లాన్ అంటూ అభివృద్ధి చేయకపోగా... దాతలను చేయనీయకుండా మోకాళ్లడ్డు
- బాసర పుణ్యక్షేత్ర అభివృద్ధికి ఆటంకాలు తొలిగేనా ?

బాసర, జూలై 9 : చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన ఉన్న బాసర అభివృద్ధికి దాతలే నడుం బిగించారు. మాస్టర్‌ప్లాన్ అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశలు నింపి నిధులిస్తే... ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను లాగేసుకోవడం క్షేత్ర అభివృద్ధిపై ఆశలు సన్నగిల్లాయి. ఇలాంటి తరుణంలో మేమున్నామంటూ కొంతమంది భక్తులు ముందుకు వస్తున్నారు. ఆలయ విస్తరణకు రూ.కోట్లయినా పరవా లేదు సాయం అందిస్తామని చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా బాసర అభివృద్ధిపై ప్రభుత్వం నుంచి స్పందన లేదు. హామీలు తప్ప క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ఇప్పుడున్న పరిస్థితుల కారణంగా భక్తులకు అసౌకర్యాలు ఏర్పడి తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు అభివృద్ధి చేయకపోవడంతో దాతలు ముందుకు రావడం శుభసందర్భంగా దేవస్థాన వర్గాలు భావిస్తున్నాయి.

అనుమతులకు దేవాదాయశాఖ తాత్సారం

ప్రభుత్వ దేవాదాయశాఖ తీరు బాసర పుణ్యక్షేత్ర అభివృద్ధికి శాపంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాసర క్షేత్ర అభివృద్ది కోసం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టేందుకు బాసర ఆలయ అధికారులు మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి దాన్ని అనేక సవరణలు చేసి చివరగా సిద్ధమైన మాస్టర్‌ప్లాన్ దేవాదాయశాఖకు సమర్పించింది. అప్పటి దేవాదాయశాఖ అధికారులు అనుమతులిస్తే పనులు ప్రారంభమై ఇప్పటి వరకు పూర్తయ్యేవి. కాని అనుమతులు ఇవ్వకపోవడంతో జిల్లా కలెక్టర్ వద్దే ఆ నిధులు మురిగిపోయాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక సమస్యల కారణంగా కలెక్టర్ వద్ద ఉన్న నిధులను లాగేసుకుంది. వచ్చిన నిధులు తిరిగి వెళ్లిపోవడంతో బాసర ఆలయ అభివృద్ది పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వంపై ఆశలు సన్నగిల్లడంతో దాతలు ముందుకు రావడం మరోసారి బాసర అభివృద్ధిపై అదికారులు దృష్టి సారించారు. దాతలతో పనులు చేపట్టేందుకు అనుమతుల కోసం దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అనేక కొర్రిలు, సందేహాలతో అనుమతులిచ్చే విషయంలో దేవాదాయశాఖ అధికారులు తాత్సారం చేస్తున్నట్లు సమాచారం. అనుమతుల జారీలో జాప్యం జరిగితే ముందుకొచ్చిన దాతల అవకాశాన్ని చేజారిపోతుందనే ఆందోళన ఆలయ వర్గాల్లో నెలకొంది.

రూ. కోట్ల విరాళంకు సిద్ధం

ప్రస్తుతం అమ్మవారి ప్రధాన ఆలయ విస్తరణ పనులు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఇరుకుగా ఆలయం ఉండడం ప్రధాన ఆలయంలో సరస్వతీ అమ్మవారు, లక్ష్మీదేవి భక్తులు సులభంగా దర్శించుకునే అవకాశం లేకపోవడం, ఇరుకుగా ఉన్నందున భక్తులు దర్శించుకునే సమయం అధికమవడం ఇలా అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతంపెరిగిన రద్దీకి ఆలయ ప్రాంగణం కూడా సరిపోక సమస్యలు తలెత్తుతున్నాయి. అదేవిధంగా అమ్మవారి ప్రధాన ఆలయం, ముందర మండపం చిన్నపాటి వర్షానికే ఊరుస్తుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని దేవస్థాన అధికారులు, పండితులు ఆలయ విస్తరణ తప్పనిసరి అంటున్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం చేస్తుందన్న నమ్మకంతో ఉన్న స్థానికులకు చివరకు నిరాశే మిగిలింది. ఇలాంటి సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఒక భక్తుడు అమ్మవారి ప్రధాన ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన ఖర్చంతా పెట్టుకుంటానని ముందుకొచ్చారు. మరో వందేళ్లు ఉండే విధంగా కృష్ణశిలలతో నిర్మించేందుకు సిద్ధమయ్యారు. రూ.కోట్లు నిధులిచ్చేందుకు అంగీకరించారు. అనుమతులిస్తే ఆలయం నిర్మించి దేవస్థానానికి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకా మిగితా బిర్లాకంపెనీ, జీఎంఆర్ వంటి కార్పొరేట్ కంపెనీలు సైతం విరాళంగా పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. దాతలు సహాయంతో చేపట్టి ఏమైన పనులకు నిధులు తక్కువైతే దేవస్థానం వద్ద రూ.కోట్ల నిధులున్నాయి. ఆలయ విస్తరణకు సుమారు రూ.30 కోట్లు అవసరముంటుందని ప్రాథమిక అంచనా, ప్రస్తుతం దేవస్థానం వద్ద రూ.10 నుంచి రూ.15 కోట్లు మిగులు నిధులున్నాయి. ఇంకా పనులు ప్రారంభమయితే ఇప్పుడు వచ్చిన దాతలే కాదు చాలా మంది భక్తులు తమ తోచినంత విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తారని ఆలయ పండితులు చెబుతున్నారు. అంతకంటే ముందు ఇక్కడ దేవాదాయశాఖ అనుమతులే కీలకమని వారు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్య

అమ్మవారి ఆలయ అభివృద్ధి విషయంలో జరుగుతున్న జాప్యం గురించి ఆలయ అర్చకులు, అధికారులు తాజాగా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే గత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే బాసర గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ద్వారా పనులు చేపట్టేందుకు ఆలస్యమైతే దాతల సహకారంతో ఆలయ విస్తరణ పనులకు సంబంధించి దేవాదాయశాఖ అనుమతుల విషయమై ఎమ్మెల్యేతో చర్చించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు అధికారులు తెలిపారు.

అధికారుల దృష్టికి తీసుకెళతాం

అమ్మవారి ప్రధాన ఆలయ పునర్నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన దాతల గురించి ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసకెళ్లాం. మరోసారి అధికారులతో చర్చిస్తాం. అనుమతులివ్వాలని కోరతాం.

విజయ రామారావు, ఆలయ ఈవో

దాతలు సిద్ధంగా ఉన్నారు..

అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు అవసరమైన నిధులను ఇచ్చేందుకు ఓ భక్తుడు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికోట్ల ఖర్చయినా పరవా లేదు పెట్టుకుంటానని ఆయన ముందుకొచ్చారు. ఆయన ఒక్కరే కాదు మరికొంత మంది భక్తులు ఆలయ విస్తరణ పనులు చేపట్టేందుకు, విరాళాలు అందించేందుకు అంగీకరించారు. పనులు ప్రారంభమైతే ఇంకా చాలా మంది సహకారం అందించేందుకు ముందుకు వస్తారు.

ప్రవీణ్ పాఠక్, ఆలయ స్థానచార్యులు

ఆలయ విస్తరణతో సమస్యలు దూరం

అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం ఇప్పుడు అత్యవసరం. ఈ విస్తరణ పనులు జరిగితే భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూజలు, దర్శనాలు సులభంగా జరిపించవచ్చు. ఇప్పుడు భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ దూరమవుతాయి. అందుకు మావంతు కృషి చేస్తున్నాం.

(సంజీవ్ మహారాజ్, ఆలయ ప్రధాన అర్చకులు)

సుబ్రహ్మణ్య స్వామికి క్షీరాభిషేకం



పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ కల్చరల్, జూలై 9 : జిల్లా కేంద్రంలోని సిరిగిరి క్షేత్రం విశ్వనాథ్‌పేటలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యాపారస్తుడు పద్మరాజు దంపతులు ఆలయానికి హుండీని బహూకరించారు. గురుస్వామి చిన్నయ్య, శంకర్, దేవేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. రాజేశ్వరి అన్నదానం చేశారు.

మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూలై 9 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా ఆమెను నిర్మల్ జిల్లా నాయకులు సన్మానించి అభినందించారు. మంగళవారం మంత్రి సొంత నియోజకవర్గం ములుగు జిల్లాకు వెళ్లి అభినందించారు. ఆకుల హరీష్, అడపా శ్రీకాంత్, లక్క సతీష్, తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన నాయకులు



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూలై 9 : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను నిర్మల్ జిల్లా బీజేపీ నాయకులు మంగళవారం వేములవాడలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని అభినందించి సన్మానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. రావుల రాంనాథ్, నూతుల భూపతిరెడ్డి, పోడెల్లి గణేష్, తదితరులున్నారు.

కొనసాగిన దుకాణాల తొలగింపు

నిర్మల్ కల్చరల్, జూలై 9 : నిర్మల్ పట్టణ ప్రధాన రహదారి పైన రాకపోకలకు ఆటంకంగా మారిన పండ్ల దుకాణాలు, వ్యాపార ప్రకటనల బోర్డుల తొలగింపు కార్యక్రమం మంగళవారం కొనసాగింది. రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో తోపుడు బండ్లను అధికారులు తొలగించారు. చైర్మన్ ఈశ్వర్ పరిశీలనలో అధికారులు సుమలత, నవీన్, కౌన్సిలర్ లక్కాకుల నరహరి, కోఆప్షన్ సభ్యుడు చిలుక గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో కొనసాగుతున్న కౌన్సెలింగ్



ఎంపికైన విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్న యూనివర్సిటీ అధికారులు

బాసర, జూలై, 9 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు కౌన్సెలింగ్ కొనసాగుతుంది. రెండవ రోజు 500ల మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉండగా 31 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. 1500ల మంది విద్యార్థులను విభజించి మూడు రోజుల పాటు కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. చివరి రోజు బుధవారం మిగిలిపోయిన విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉంటుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కౌన్సిలింగ్‌కు గైర్హాజరైన విద్యార్థుల సీట్లను వెయిటింగ్ లిస్ట్ నుంచి తీసుకుంటామని చెప్పారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆగస్టులో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

కుబీర్, జూలై, 9: మండలంలోని పార్డి (బీ) గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే రాంరావు పటేల్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.16 లక్షలతో నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని శిల ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలో రూ.13 లక్షలతో గ్రంథాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి భవనాన్ని ప్రారంభంలో ప్రజలు ప్రథమ చికిత్స అందుబాటులోకి వచ్చిందని, అదేవిధంగా విద్యార్థుల కోసం గ్రంథాలయం నిర్మించడం జరుగుతుదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.వసుంధర, ప్రణయ్, అవినాష్, నాయకులు వడ్నం నగేష్, యేషాల దత్తాత్రి, కనకయ్య, గులాబ్‌సింగ్, నగేష్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, ఏఎన్ఎం, తదితరులు ఉన్నారు.

‘నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్’



మాట్లాడుతున్న సీఐ సైదారావు

దస్తురాబాద్, జూలై 9 : నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మున్యాల్ గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు సురక్షితమైన భద్రత కల్పించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఈ ప్రోగ్రాం అన్నారు. నిర్వహించిన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 89 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలకు జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు సైబర్ నేరాల, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శంకర్, లింబాద్రి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, జూలై 9 : అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం వన మహోత్సవం, మహిళాశక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ధరణి, సీజనల్ వ్యాధులు, ప్రజాపాలన సేవా కేంద్రాలు, ఉద్యోగుల బదిలీలు, తదితర అంశాలపై ఆమె జిల్లాల వారీగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గత జూన్‌మాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వరంగల్‌లో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధికసంఖ్యలో మొక్కలు నాటాలని, ప్రతి మొక్కను జియోటాగ్ చేయాలని సూచించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మహిళాశక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మపరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, ప్రోత్సహించడం, ఆర్థిక సహకారం అందించడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డెంగీ, మలేరియా, అతిసార వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను వెంటనే చేయాలన్నారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియను నిబంధనలను పాటిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం విజయవంతానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకి జిమో ట్యాగింగ్ చేసి, సంరక్షించాలని సూచించారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా పలు అంశాలలో మహిళా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనుల్లో మిగిలిని వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా సమాఖ్యలు మండల సమాఖ్యలతో సమావేశాలు ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులంతా విత్తనాలు నాటారని, రైతులు సాగు చేసిన విస్తీర్ణం, పంటలకు సంబంధించిన వివరాలను అంచనా వేసి సరిపడినన్ని ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. క్రమం తప్పకుండా డ్రైనేజీలను శుభ్రం చేయాలని, మురుగు నీటిలో యాంటీ లార్వాలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శాఖల వారీగా ఖాళీలు, బదిలీలకు అర్హత ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలని, నిబంధనల మేరకు ప్రక్రియ ను పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియోలో కాన్ఫరెన్స్ అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, అటవీ అధికారి ప్రసాద్, డీఆర్‌వో భుజంగ్‌రావ్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఈవో రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సమస్యలను పరిష్కరించండి

- టీజేఏసీ వ్యవస్థాపకులు కోదండరాంకు బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మొర



ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలపై ప్రొఫెసర్ కోదండరాంకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

బాసర, జూలై, 9 : బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని టీజేఏసీ వ్యవస్థాపకులు కోదండరాంకు విన్నవించారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యల గురించి వినతి పత్రం సమర్పించారు. హస్టళ్లలో సరైన ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, కిటికీలు, బాత్‌రూమ్‌లకు తలుపులు లేవని అసౌకర్యాల మధ్య ఉంటున్నామని మొరపెట్టుకున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అవసరమైన అధ్యాపకులు లేకపోవడంతో చదువుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చాలా మంది విద్యార్థులు వెనుకబడి పోయి పరీక్షలను తప్పుతున్నారని చెప్పారు. రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇతర కీలకమైన పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని అన్నారు. యూనివర్సిటీ అధికారులు సమస్యలను చెప్పుకునేందుకు వెళితే స్పందించడం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో సమస్యల పోరాటం కోసం చేసిన ఆందోళనను విద్యార్థులు గుర్తుచేశారు. అయినా ట్రిపుల్ ఐటీలో పరిస్థితి మారలేదని ఈ ప్రభుత్వమైన పట్టించుకునేలా చూడాలని విద్యార్థులు కోరారు. సమస్యలు చెప్పుకునేందుకు వెళితే బెదిరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల వెంట ముథోల్ నియోజకవర్గ టీజెఎస్ ఇంచార్జీ వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా సీత్లా పండుగ



సీత్లా పండుగను నిర్వహిస్తున్న దృశ్యం

దస్తురాబాద్, జూలై 9 : మండలంలోని మున్యాల్ తండా, ఎర్రగుంట గ్రామాల్లో మంగళవారం బంజారాల ఆరాధ్య దైవమైన సీత్లాభవాని పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో సీత్లా భవానిని ప్రతిష్ఠించి, ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని తెలిపారు. పశుసంపద, అభివృద్ధి, ఆరోగ్యం, తండా సౌభాగ్యం కోసం సీత్లా యాడి పూజ చేయడం బంజారాల ఆనవాయితీ అని వారు అన్నారు.

వేతనాలు పెంచాలని ఆశాల వినతి



ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, జూలై 9 : కనీస వేతనాలు పెంచాలని మండలంలోని ఆశా కార్యకర్తలు మంగళవారం మండల ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఎన్‌హెచ్ఎం స్కీంను రక్షించాలని, ఆశాలను కార్యకర్తలుగా గుర్తించాలని కోరారు. ఈ నెల 10న దేశ వ్యాప్తంగా జరిగే కోరికల దినం నిరసన కార్యక్రమంలో ఆశాలు పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు.

11న నగదు రహిత వైద్యం కోసం
వినతి చేయనున్న పెన్షనర్లు

నిర్మల్ కల్చరల్, జూలై 9 : రాష్ట్రంలోని పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ ఈ నెల 1న కలెక్టర్‌కు వినతి చేయనున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు తరలిరావాలని ఆయన కోరారు.

పదవీ విరమణ ఫలాల కోసం
అంగన్‌వాడీ రిలే దీక్షలు

నిర్మల్ కల్చరల్, జూలై 9 : అంగన్‌వాడీలకు పదవీ విరమణ తరువాత జీతంలో సగం పెన్షన్ చెల్లింపు, ఫలాల కోసం మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన దీక్షలు మూడో రోజుకు చేరాయి. పదవీ విరమణలను కొత్త జీవో వచ్చే వరకు నిలిపి వేయాలని నాయకులు కోరారు. జూన్ 29న విడుదల చేసిన మెమో ఉపసంహరించుకోవాలన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకునేలా ఆదేశించాలని మంత్రి సీతక్కను కోరారు. కొత్త జీవోలు వచ్చే వరకు దీక్షలు కొనసాగించనున్నట్లు తెలిపారు. 65 ఏళ్ల పైబడిన టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు.